
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
బుధవారం 19 నవంబరు 2025



జలపాతాల వద్ద వసతుల కల్పన

పాచిపెంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జలపాతాల వద్ద వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి ఆదే శించారు. మంగళవారం నీలంవలస సమీపంలోని జలపాతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పర్యాటకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన మహిళలకు రుణాలు మంజూరు చేసి ఈ ప్రాంతంలో పలు దుకాణాలు ఏర్పాటు చేయించాలని వెలుగు ఏపీఎం శ్రీరాములుకు సూచించారు. గ్రామస్థులతో మాట్లాడి రహదారి అభి వృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.

అన్నదాత సుఖీభవ



- నేడు రెండో విడత నిధులు విడుదల
- 1,22,260 మంది రైతులకు లబ్ధి
- ఖాతాల్లోకి జమ కానున్న రూ.83.87 కోట్లు

పార్వతీపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' రెండో విడత నిధులను రాష్ట్ర ప్రభుత్వం నేడు విడుదల చేయనుంది. ఈ మేరకు జిల్లాలో 1,22,260 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. వారి ఖాతాల్లోకి రూ.83.87 కోట్లు జమకానున్నాయి. కేంద్రం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 వేల చొప్పున మొత్తంగా రూ.7వేలు అర్హులకు అందనుంది. పాలకొండ నియోజకవర్గంలో 33,107 మందికి రూ.22.75 కోట్లు, కురుపాంలో 39,084 మందికి రూ. 26.94 కోట్లు, పార్వతీపురంలో 25,807 రైతులకు రూ.17.20 కోట్లు, సాలూరులో 24,262 మందికి రూ.16.98 కోట్లు అందించనున్నారు. ఇందులో కేంద్రం వాటా రూ.22.20 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం రూ.61.13 కోట్లుగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలో అన్నదాత సుఖీభవ కింద రూ. 85.57 కోట్లు అందించింది. రెండు విడతల్లో మొత్తంగా రూ. 169.44 కోట్లు మంజూరు చేసింది.



ఆర్‌వోఎఫ్‌ఆర్ రైతులకు..

జిల్లాలో 22,687 మంది ఆర్‌వైఎఫ్‌ఆర్ రైతులు ఉన్నారు. వీరి బ్యాంక్ ఖాతాల్లోనూ 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' కింద రూ.11.34 కోట్లు జమ కానున్నాయి. పార్వతీపురం నియోజకవర్గంలో 713 మంది, కురుపాంలో 10,553, సాలూరులో 5,820 మంది, పాలకొండలో 5,601 మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూరనుంది.



జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు

సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందించనున్నారు. కురుపాంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, పార్వతీపురం మండలం అడ్డాపు శీల గ్రామంలో ఎమ్మెల్యే విజయచంద్ర, పాలకొండ నియోజకవర్గం వీరఘట్టంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్లు వైశాలి, పవార్ సప్నిల్ జగన్నాథ్ , జిల్లా వ్యవసాయశాఖ అధికారి అన్నపూర్ణ తదితరులు పాల్గొనున్నారు. అర్హులైన రైతుల ఖాతాల్లో నేడు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు జమ కానున్నాయని కలెక్టర్ తెలిపారు. ఇక జిల్లాలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో రైతులకు చెక్కులు అందిస్తామన్నాని వెల్లడించారు.



అతిగా యాంటీ బయాటిక్స్

వాడరాదు

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అతిగా యాంటి బయాటిక్స్ ట్యాబ్లెట్లు వాడరాదని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) వారోత్సవాల సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాంటీ బయాటిక్స్‌ను అధిక మోతాదులో వాడితే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆ తర్వాత చికిత్స అందించడం మరింత కష్టతరమవుతుందని స్పష్టం చేశారు. వైద్యుల చీటీ లేకుండా ఎవరైనా ఆ మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

రబీకి సన్నద్ధం



- 56,060 ఎకరాల్లో సాగుకు సన్నాహాలు
- విత్తనాలు, ఎరువుల సరఫరాకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు


పార్వతీపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులు రబీ సాగుకు సిద్ధమవుతున్నారు. మొత్తంగా 56,060 ఎకరాల్లో పలు రకాల పంటలు పండించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో 5,100 ఎకరాల్లో వరి 14,587 ఎకరాల్లో మొక్కజొన్న, 142.5 ఎకరాల్లో రాగి , 8367.5 ఎకరాల్లో పెసర , 18,880 ఎకరాల్లో మినుములు, 775 ఎకరాల్లో ఉలవలు, 472.5 ఎకరాల్లో వేరుశనగ, 7,445 ఎకరాల్లో నువ్వులు సాగు చేయనున్నారు. రబీ రైతులకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు మరోవైపు జిల్లా వ్యవసాయ శాఖ సర్వం సిద్ధం చేసింది. వారికి పూర్తి స్థాయిలో విత్తనాలతో పాటు ఎరువులు తదితర వాటిని సరఫరా అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇదిలా ఉండగా జిల్లాలో కొన్ని ప్రాజెక్టుల నుంచే రబీ పంటలకు సాగు నీరు అందనుంది. వీఆర్‌ఎస్, పెద్దగెడ్డ తదితర జలాశయాల నుంచి నీరు సరఫరా చేసే అవకాశం లేకపోవడంతో ఏటాలానే ఈ రబీ సీజన్‌లో కూడా వరి కంటే మొక్కజొన్న, పెసర, మినుములు, నువ్వులను అధికంగా పండించేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

2,852 క్వింటాళ్ల విత్తనాలు అవసరం

- రబీ కాలానికి సంబంధించి జిల్లాకు 2,852 క్వింటాళ్ల విత్తనాలు అవసరం. ఇందులో వరి విత్తనాలు పాడి ఎంటీయూ 1121 రకం 110 క్వింటాళ్లు, పాడి ఎన్‌ఎల్‌ఆర్ 34449 రకం విత్తనాలు 85 క్వింటాళ్లు , మినుములు 410 క్వింటాళ్లు, వేరుశనగ 841 క్వింటాళ్లు, నువ్వులు 18 క్వింటాళ్లు, రాగి 10 క్వింటాళ్ల విత్తనాల అవసరం ఉంది. ప్రస్తుతం జిల్లాలో 181.66 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. మిగిలినవి మరికొద్ది రోజుల్లో జిల్లాకు రానున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.
- గత రబీ సీజన్‌లో 1,474 క్వింటాళ్ల విత్తనాలను 4,614 మంది రైతులకు అందించారు. ఇందులో 859 క్వింటాళ్లు 90 శాతం రాయితీపై పంపిణీ చేశారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో రైతులకు సబ్సిడీపై 2,920 క్వింటాళ్ల విత్తనాలు అందించనున్నారు. ఇందులో వరి 205 క్వింటాళ్లు, మిల్లెట్స్ 12 క్వింటాళ్లు, పిచ్చిరొట్ట విత్తనాలు 611 క్వింటాళ్లు, మినుములు 828 క్వింటాళ్లు, పెసర 361 క్వింటాళ్లు , వేరుశనగ 841 క్వింటాళ్లు, ఉలవలు 30 క్వింటాళ్లు, నువ్వులు 18 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేయనున్నారు. 1237 క్వింటాళ్ల విత్తనాలను గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై సరఫరా చేయనున్నారు. దీనిపై జిల్లా వ్యవసాయ శాఖాధికారి అన్నపూర్ణను వివరణ కోరగా.. 'రబీ రైతులకు అవసరమైన సహకారాన్ని అందిస్తాం. సబ్సిడీపై అర్హులకు విత్తనాలు అందిస్తాం. అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సలహా, సూచనలు అందిస్తాం. ' అని తెలిపారు.

పనిభారంతో

సతమతం



- పోలీసులకు తప్పని అవస్థలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- రెండేసి షిఫ్టుల్లో విధులు

రాజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏ శాఖలైనా బదిలీలు అంటే సంబరపడ తారు పోలీస్ శాఖలో మాత్రం నిరాశ పడతారు. ఎందుకంటే ఎక్కడికి వెళ్లినా అదే ఒత్తిడి. తక్కువ సిబ్బంది పనిచేయడమే దీనికి కారణం. వాస్తవానికి ప్రతీ పోలీస్ స్టేషన్‌లో 40 మంది సిబ్బంది ఉండాలి. ఎక్కడా 20కు మించి లేరు. దీంతో సిబ్బంది పని ఒత్తిడికి గురవుతున్నారు. రిటైర్మెంట్ వయసు 58 నుంచి 62 ఏళ్లకు పెరిగేసరికి చాలా శాఖల్లో ఆనందం కనిపించింది. కానీ పోలీస్ శాఖలో మచ్చుకైనా కానరాలేదు. ఇప్పటికీ చాలా మందికి షిఫ్టుల్లో పనిచేయాల్సి వస్తోంది. రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నవారు కోకొల్లలు. మూడు షిఫ్టులనేది కాగితాలకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తిచేసుకొని వస్తే కొంత ఉపశమనం దక్కుతుందని భావిస్తున్నారు. కొత్తగా కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఎస్‌ఐ పోస్టులు భర్తీ చేసిన సంగతి తెలిసిందే. కానీ ఇంతవరకూ వారికి శిక్షణే ప్రారంభం కాలేదు.

షిఫ్టుల రొటేషన్

- పోలీస్ శాఖలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ మరో షిఫ్ట్ ఉంటుంది. అయితే ఉదయం షిఫ్ట్ చేసిన వారు మళ్లీ రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకూ చేయాల్సిందే. దీనినే రెండు షిఫ్టుల పద్ధతిగా పరి గణిస్తారు. సిబ్బంది లేకపోవడంతో రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన నెలలో విధిగా ప్రతిఒక్కరూ 15 రోజుల పాటు నైట్ షిఫ్టులు చేయాల్సి ఉంటుంది. దీంతో మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారు. చాలా మంది గుండెపోట్లకు, ఇతర రుగ్మతలకు గురవుతున్నారు. సిబ్బందిని నియమించి

(మిగతా 6వ పేజీలో...)



చిన్నారులపై దాడులను

అరికట్టాలి


- జిల్లా బాలల సంరక్షణాధికారి సత్యనారాయణ

సాలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై దాడులను ప్రతి ఒక్కరూ అరికట్టాలని జిల్లా బాలల సంరక్షణాధికారి అల్లు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైసీటీసీలో బాలల హక్కులు, సంక్షేమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..' బాల్య వివాహాలను అడ్డుకోవాలి. విద్య, వైద్యం, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, పోక్సో చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలి. మహిళా పోలీసులు, సెక్రటరీలు, రెవెన్యూ ఆఫీసర్లు సమన్వయంతో పనిచేయాలి.' అని తెలిపారు. బాలలకు ఏం జరిగినా తక్షణమే చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098 కు సమాచారం అందజేయాలని కోరారు.

మన్యంలో అలర్ట్

- పోలీసులు అప్రమత్తం
- విస్తృతంగా తనిఖీలు

పార్వతీపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతా రామరాజు జిల్లా మారేడుమిల్లి టైగర్ జోన్‌లో మంగళవారం తెల్లవారు జామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మృతి చెందడంతో జిల్లా పోలీసులు అప్రమత్తమ య్యారు. మరోవైపు మావోయిస్టు గెరిల్లా దళాలు విజయవాడలోని ఆటోనగర్‌లో పోలీసులకు చిక్కడం, వారి నుంచి భారీ ఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం సంచలనం కలిగించింది. దీంతో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో రోడ్డు ఓపెనింగ్ పార్టీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్‌ఐలు అన్ని ప్రాంతాలనూ జల్లెడ పట్టారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్నీ తనిఖీ చేశారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. ఏజెన్సీ రహదారులు, ఏవోబీ సరిహద్దుల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు సీసీ కెమెరాల్లోంచి కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. బుధవారం కూడా విజయ నగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అన్ని అనుమానిత ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టనున్నారు.


సీతంపేట మండలంలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

గిరిజన మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

- మంత్రి సంధ్యారాణి

మక్కువ రూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): గిరిజన మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం శంబర గ్రామానికి సమీపంలోని వెంగళరాయసాగర్ (వీఆర్‌ఎస్) ప్రాజెక్టులో నాలుగు లక్షల చేప పిల్లలను విడిచి పెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'గిరిజన మత్స్యకారుల కోసం గ్రామీణ ప్రాంతాల్లో సొసైటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఆంధ్ర, పెద్దగెడ్డ, వీఆర్‌ఎస్ ప్రాజెక్టుల్లో పెద్దఎత్తున చేపల పెంపకం చేపట్టి, వాటి క్రయ, విక్రయాల బాధ్యతలు వారికి అప్పగిస్తున్నాం. వీఆర్‌ఎస్ పరిధిలో ఉన్న 420 మంది మత్స్యకార సొసైటీ సభ్యుల కోసం ఏటా సాగరంలో లక్షలాది చేప పిల్లలను విడిచిపెడుతున్నాం. చేప పిల్లల పెంపకానికి అయ్యే ఖర్చులో 40 శాతం లబ్ధిదారుని వాటా కింద చెల్లించాల్సి ఉంది. అయితే గిరిజన మత్స్యకారులకు ఇబ్బంది కలగకుండా ఆ మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తోంది. మత్స్యశాఖ 40శాతం సబ్సిడీపై సొసైటీ సభ్యులకు అందిస్తున్న బైక్‌లు, నాలుగు చక్రాల వాహనాలను సద్వినియోగం చేసుకోవాలి.' అని తెలిపారు. మత్స్యకార సొసైటీలకు మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో గిరిజనుల కోసం వెచ్చించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్స్య సంపదను పెంచేందుకు మన్యంలో 280ఎకరాల విస్తీర్ణంలో చెరువులను గుర్తించామని, ఇందులో 180 ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ పూర్తి చేశామని జిల్లా మత్స్యశాఖాధికారి టి.సంతోష్ తెలిపారు. మరో 110 చెరువుల్లో చేపల పెంపకానికి సంబంధించి త్వరలో టెండర్లు పిలవనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది తోటపల్లిలో 10లక్షలు,

(మిగతా 6వ పేజీలో...)


వెంగళరాయసాగర్‌లో చేప పిల్లలను విడిచిపెడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రభుత్వ పాఠశాలల్లో

ముస్తాబు తప్పనిసరి: కలెక్టర్

బెలగాం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో విధిగా ముస్తాబు కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పాఠశాల ప్రాంగణాల్లో చెత్త లేకుండా చూడాలన్నారు. పరిశుభ్ర వాతావరణం కనిపించాలని, పచ్చని మొక్కలు, పూలతో ఆకర్షణీయంగా ఉండాలని తెలిపారు. మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించి వాటి సంరక్షణ బాధ్యతలను అప్పగించాలన్నారు. వెలవెలబోయిన గోడలు, నాచుతో ఉన్న ప్రదేశాలను శుభ్రపరిచి వాటికి సున్నం వేయించాలని సూచించారు. ప్రతి తరగతిలో చెత్త డబ్బాను ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థులకే కాకుండా ఉపాధ్యాయులకు కూడా ముస్తాబు

(మిగతా 6వ పేజీలో...)


హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పనిభారంతో సతమతం

(5వ పేజీ తరువాయి)

మూడు షిఫ్టులు కొనసాగిస్తే.. నెలకు పదికి మించి నైట్ డ్యూటీలు రావు. అది కూడా ప్రతి మూడు రోజులకు ఒకసారి నైట్ డ్యూటీ పడే అవకాశం ఉంది. వీక్లీఆఫ్‌లు సైతం తీసుకునేందుకు వెసులబాటు కలుగుతుంది. ● ఉమ్మడి జిల్లాలో మూడు సబ్ డివిజన్లను 10 సర్కిళ్లుగా విభజించారు. అయితే ఏ స్టేషన్‌లోనూ పూర్తిస్థాయి సిబ్బంది లేరు. పెరుగుతున్న విధులకు ఈ సిబ్బంది ఏ మూలకూ చాలడం లేదు. ఉన్న కొద్దిపాటి సిబ్బంది షిఫ్టులు వేసుకొని విధులు నిర్వహిస్తున్నారు. అత్యవసర, అనారోగ్య పరిస్థితులు, ఇంటి అవసరాలకు గంటల లెక్కనే సెలవు మంజూరవుతోంది. అత్యవసరం అయితే తోటి సిబ్బందితో సర్దుబాటు చేసుకోవాల్సిందే. అదీ కూడా స్టేషన్ అధికారి అనుమతిస్తేనే. లేకుంటే ఇబ్బందులు తప్పవు.

గిరిజన మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

(5వ పేజీ తరువాయి)

వెంగళరాయసాగర్‌లో 4లక్షల చేప పిల్లలను విడిచిపెట్టామని చెప్పారు. మరోరెండు నెలల్లో మరో లక్ష చేప పిల్లలను ఈఆర్‌ఎస్‌లో విడిచి పెడతామన్నారు. ● వెంగళరాయసాగర్ ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సంధ్యారాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సందర్శకుల కోసం బెంచీలు ఏర్పాటు చేయా లని, సాగరంలో బోటు షికారు కోసం ఐదు బోట్లు కొనుగోలు చేయాలని సూచించారు. బోట్లు నడప డంపై గిరిజన యువతకు శిక్షణ ఇవ్వాలన్నారు. పార్వతీపురం సబ్ కలెక్టర్ వైశాలి, ప్రాజెక్టు డీఈఈ సురేష్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ముస్తాబు తప్పనిసరి

(5వ పేజీ తరువాయి)

వర్తిస్తుందని స్పష్టం చేశారు. పిల్లలు చేతులు కడిగే స్థలం, మరుగుదొడ్లు ఎప్పుడూ శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి నెల క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. కబడ్డీ తదితర క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి అథ్లెటిక్స్‌కు పంపించనున్నట్లు వెల్లడించారు. ప్రతి శనివారం ఆనందలహరి పేరుతో పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆదేశించారు. విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలనానరు. అనంతరం ముస్తాబు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో బి.రాజ్‌కుమార్, సాంఘిక సంక్షేమ జిల్లా అధికారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

28న ఉద్యోగులుచ పెన్షన్‌దారుల గ్రీవెన్స్

పార్వతీపురం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, పెన్షన్‌దారుల కోసం ఈ నెల 28న శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నవంబరు 28న కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు గ్రీవెన్స్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ సేవలను వినియోగించుకోండి

గరుగుబిల్లి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలను రైతులు వినియోగించుకోవాలని ఎంపీపీ ఉరిటి రామారావు, కొప్పల వెలమ సంక్షేమం-అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు ముందుగానే ప్రభుత్వం చేపట్టిందన్నారు. ధాన్యాన్ని మద్దతు ధరకే విక్రయించాలన్నారు. మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్స్న మాట్లాడుతూ 13 సచివాల యాల పరిధిలో ముందుగా 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.పురుషోత్తం నాయుడు, ఎం.తవిటినాయుడు, వై.నారాయణస్వామి, ముదిలిబాబు విజయవాంకుశం, జనసేన, బీజేపీ నాయకులు బోను శివ, పెదిరెడ్డి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

గరుగుబిల్లి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు, ప్రిన్సిపాల్ ఎ.రజనికుమార్, వైస్ ప్రిన్సిపాల్ జి.లక్ష్మమ్మ, గ్రంథాలయ అధికారి కె.మాధవి పాల్గొన్నారు.

●సీతంపేట రూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాచరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తంగా స్థానిక హైస్కూల్‌కు చెందిన 40మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథాలయ అధికారి బి.గణేష్ తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

గరుగుబిల్లి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలను ఆమె తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకంతో పాటు మరుగుదొడ్లు, పరిసరాలు, స్టోర్ గదిని పరిశీలించారు. భోజన నిర్వహ ణలో లోపాలు ఉంటే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. పరిశీలనలో ప్రిన్సిపాల్ ఎ.రజనికుమారి, సీనియర్ సహాయకుడు శ్రీనివాసరావు ఉన్నారు.

పెదబుడ్డిడి వీఆర్వోపై చర్యలు తీసుకోండి

జియ్యమ్మవలస, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పెదబుడ్డిడి వీఆర్వో దూసి తిరుపతిరావుపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పెదబుడ్డిడిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీఆర్వో తిరుపతిరావు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకపోతే పనులు చేపట్టడంలేదన్నారు. సమావేశంలో సీపీఎంమండల కార్యదర్శి కె.సీతారాం ఉన్నారు.

తాగునీటి పథకాన్ని మంజూరు చేయండి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో దాని స్థానంలో కొత్త మంచినీటి పథకాన్ని మంజూరు చేయాలని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి.గౌరీశంకరరావు పార్వతీపురం మన్యం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి మంగళవారం విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తాను పరిశీలించిచర్యలు చేపడతానన్నారు.

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

ఒడిశా

రాయగడ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుదరాయివలస ప్రాంతానికి చెందిన కడగల్ల అప్పలనారాయణ 2014 ఆగస్టు 9న హత్యకు గురైన నేపథ్యంలో అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేశారు. ఆ కేసులో ఐదుగురిని దోషులుగా జిల్లా న్యాయస్థానం మంగళవారం తేల్చింది. వారికి జీవితఖైదు విధిస్తూ జిల్లా న్యాయాధికారి సత్యనారాయణ షడంగి తీర్పు వెల్లడించారు. హత్య కేసుకు సంబంధించి 14 మందిని న్యాయమూర్తి సత్యనారాయణ షడంగి విచారించారు. అందులో పతివాడ సూర్యారావు, పతివాడ శ్రీనివాస్, పతివాడ త్రినాథరావు, పతివాడ శంకరారావు, పి.సత్యంలను దోషులుగా తేల్చారు. వారికి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించకుంటే మరో 6 నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారని ప్రభుత్వ న్యాయవాది బిక్రమ్‌కుమార్ కుందు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి



క్రీడలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ప్రభుత్వ విప్ జగదీశ్వరి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 విభాగం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల బాలికలు స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొనాల న్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని వ్యాయాయ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని నాలుగు డివిజన్ల పరిధిలోనివిజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, చీపురుపల్లి పాఠశాలల నుంచి బాల బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, టీడీపీ మండల అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, ఎంఈవో-2 బీముడు, తహసీల్దార్ శేఖర్, బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిమ్మక సింహాచలం, మండల కన్వీనర్ కడ్రక అప్పస్వామి, మాజీ కన్వీనర్ పాడి సుదర్శనరావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.నాగమణి పాల్గొన్నారు.

కళాకారులకు సముచిత స్థానం

●వివరాలు నమోదు చేసుకోండి ● కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తూ వారికి సముచిత స్థానం కల్పించేందుకు శ్రీకారం చుట్టామని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన జారీ చేశారు. ఏదైనా కళారూపంలో అనుభవం కలిగి పోటీలు, ప్రదర్శనల్లో ఇది వరకు పాల్గొన్న కళాకారులు తమ పూర్తి వివరాలను కళాకారులు నమోదు ఫారం ద్వారా అందించాలన్నారు. వీడియోల ద్వారా ప్రజలను ప్రభావితం చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కళాకారుల ఇందుకు కోసం 9949996497 నెంబరును సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

రైతులే దేశానికి వెన్నెముక



నిడగల్లులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): రైతులే దేశానికి వెన్నెముక అని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం తాళ్లబురిడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పంట పొలాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకెళ్లే బాధ్యతను ప్రభుత్వమే చేపడుతోందన్నారు. రైతులకు అసవరమైన గోనె సంచులను అందిస్తూ కేంద్రాలకు ధాన్యాన్ని తరలించేందుకు కలాసీ, రవాణా చార్జీలను కూడా ప్రభుత్వమే చెల్లిందన్నారు. ధాన్యాన్ని తరలించే రైతులకు గత ఏడాది కొన్ని గంటల్లోపే నగదు జమ చేశారని గుర్తుచేశారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు అందించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో గొట్టాపు వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, గొరజాన చంద్రమౌళి, కోట శ్రీధర్, బేత లక్ష్మణరావు, జాగరణ రవిశంకర్, నాయకులు, పౌరసరఫరాల అధికా రులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే తాళ్లబురిడి గ్రామంలోని ఎన్టీఆర్ వి గ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

●సీతానగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిడగల్లు రైతు సేవాకేంద్రంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వైశాలి, పౌరసరఫరాలశాఖ అధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

భవనాలను క్రమబద్ధీకరించుకోండి

పాలకొండ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలోని అనధికార భవనాలను క్రమబద్ధీకరణ చేసుకోవాలని కమిషనర్ రత్నంరాజు సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భవనాల క్రమబద్ధీకరణ కోసం ఇటీవల ప్రభుత్వ జీవో 225ను విడుదల చేసిందన్నారు. 1985 జనవరి నుంచి 2025 ఆగస్టు 31 వరకు నిర్మాణం పూర్తయిన, నివాస, వాణిజ్య భవన నిర్మాణాలను 2026 మార్చి 11 లోగా రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్థలం కేటాయించండి



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న భూదేవి

పాలకొండ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో టీడీపీ నియోజకవర్గ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి 50 సెంట్ల ప్రభుత్వ స్థలం లీజు ప్రాతిపదికన కేటాయించాలని సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌కు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి కోరారు. మంగళవారం సబ్ కలెక్టర్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గండి రామినాయుడు, అరకు పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు వారాడ సుమంత్ నాయుడు, నాయకులు గుమ్మడి సింహాద్రి, మజ్జి జయశంకర్, బిడ్డిక జయలక్ష్మి, చొంగ శివానంద్, రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ మోహనరావు, గణేశ్ ఉన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

గరుగుబిల్లి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 25 పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు ఈ నెల 19 నుంచి 21 వరకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మంగళవారం ఆమె గరుగుబిల్లిలో విలేకరులతో మాట్లాడారు. 19న సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులకు, అలాగే 20న పంచాయతీల నుంచి గ్రామైఖ్య సంఘాలకు చెందిన ప్రతినిధులకు, 21న గ్రీన్ అంబాసిడర్లకు అవసరమైన శిక్షణ ఇవ్వనున్నా మని వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొమరాడ విద్యార్థిని



పోటీలకు ఎంపికైన విద్యార్థిని జాహ్నవి

కొమరాడ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బొంగు జాహ్నవి అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని వ్యాయాయ ఉపాధ్యాయురాలు నాగమణి, హెచ్ఎం అభినందించారు.

జాతీయ స్థాయిలో మెరిసిన ఏకలవ్య విద్యార్థులు



గెలుపొందిన విద్యార్థులు

పాచిపెంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్‌ఎస్) విద్యార్థినులు జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో మెరిశారు. రూర్కెలాలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో కోటికిపెంట ఏకలవ్య పాఠశాలకు చెందిన ధనుర్విధి అనే విద్యార్థిని వాలీబాల్, బాక్సింగ్, జూడో తదితర వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో 8 పతకాలు సాధించింది. పాఠశాల వాలీబాల్ జట్టు జాతీయ స్థాయిలో రన్నర్స్‌గా నిలిచారు. ఇదిలా ఉండగా.. మారేడుమిల్లిలో నిర్వహించిన ఆరువా సాంస్కృతిక, సాహిత్య మహోత్సవంలో కోటికపెంట ఎంఆర్‌ఎఫ్ విద్యార్థినులు హిందీ ఉపన్యాసం, వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతులు సాధించారు. వీరందరినీ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారని ప్రిన్సిపాల్ దేవేందర్‌సింగ్ మంగళవారం తెలిపారు. ఆటలు, చదువుల్లో విద్యార్థినులు ఎంతో ప్రతిభ చూపిస్తున్నారని ప్రశంసించారు. వారిని అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

భారీగా ఇసుక అక్రమ తరలింపు



యంత్రంతో లోడ్ చేస్తున్న ఇసుక

పార్వతీపురం,నవంబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ తరలింపు జోరుగా సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొమరాడ మండలంలలోని కూనేరు, రామభద్రపురం రీచ్ నుంచి ఇసుక అక్రమ తరలింపు ఇష్టారాజ్యంగా జరిగేది. అప్పట్లో టీడీపీ నాయకులతో పాటు పలు రాజకీయ పార్టీలు నాయకులు దాని అడ్డుకునేవారు. అప్పట్లో కేసులు నమోదు చేసిన తహసీల్దార్‌ను బదిలీ చేసిన పరిస్థితి నెలకొంది. తాజాగా కొమరాడ మండలంలో కూనేరు, రామభద్రపురం కేంద్రంగా ఇసుక అక్రమ తరలింపు జరుగుతోంది. మంగళవారం భారీగా కూనేరు, రామభద్రపురం నుంచి ఇసుక తరలింపు భారీ వాహనాలతో సాగింది. కొంతమంది అధికార పార్టీ నాయకులు తెర వెనుక ఉంటూ ఇసుక అక్రమ రవాణా చేపడుతున్నట్లు సమాచారం. దీనిపై జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా నా దృష్టికి రాలేదన్నారు. దీనిపై పూర్తి బాధ్యత స్థానిక తహసీల్దార్‌దేనని అన్నారు.

యువ వైద్యునికి అపూర్వ అవకాశం

●ముస్సూరీలో ఐఏఎస్‌లకు శిక్షణ కోసం ఎంపిక



డాక్టర్ వినోద్‌కుమార్

పార్వతీపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్‌కుమార్‌కు అపూర్వమైన అవకాశం లభించింది. యువ ఐఏఎస్‌లకు, రాయల్ భూటాన్ సివిల్ సర్వెంట్స్‌కు మాతా శిశు మరణాలు నివారణ తదితర అంశాలపై ప్రత్యేక అంశాన్ని బోధించే అవకాశం లభించింది. రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి డాక్టర్ వినోద్‌కుమార్‌కు ఈ అవకాశం లభించింది. బుధవారం జరగనున్న కార్యక్రమంలో మాతా శిశు మరణాలు నివారణ రక్తహీనత నివారణ తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం యువ ఐఏఎస్‌లకు ఇవ్వనున్నట్టు డాక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం విలేకరులకు ఫోన్‌లో తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'ముస్తాబు'

గరుగుబిల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ముస్తాబు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు గరుగుబిల్లి, రావివలస ఐసీడీఎస్ సెక్టార్ల సూపర్‌వైజర్లు రౌతు లక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె రావుపల్లి, సంతోషపురం, గరుగుబిల్లి, తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన ముస్తాబు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలు చక్కగా ఉండేలా అంగన్‌వాడీ వర్కర్లు తగు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. అలాగే భోజనాలకు ముందు చేతులు శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు మద్రాపు సావిత్రి, పల్ల కృష్ణవేణి, మహంతి పద్మావతి, మూడడ్ల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

కురుపాం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించనున్న ఆల్ ఇండియా మహాసభలను అందరూ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లి గంగునాయుడు కోరారు. మంగళవారం కురుపాంలో ఆల్ ఇండియా మహాసభల వాల్ పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీగా మార్చేదెప్పుడు?

●మెరుగైన సేవల కోసం రోగుల ఎదురుచూపు



వీరఘట్టంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వీరఘట్టం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి పెంపు కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు. ఇక్కడి పీహెచ్‌సీని 1998 ఆగస్టు 26న అప్పటి ఎమ్మెల్యే నిమ్మక గోపాలరావు ప్రారంభించారు. ఈ పీహెచ్‌సీకి మండలంలో 14 సచివాలయాల పరిధిలోని 42 వేల మందికి జనాభాకు సేవలు అందిస్తోంది. దీనికి తోడు బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జీఎం వలస, వంగర మండలాల నుంచి రోగులు వస్తుంటారు. ప్రతిరోజూ ఇక్కడ 120 మంది వరకూ ఓపీ ఉంటుంది. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ స్థాయిని పెంచాలని స్థానికులు పలుమార్లు పాలకులను కోరారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారితో పాటు, స్థానికులు ఐటీడీఏ పీవోను కలిసి పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్పు చేయాలని కోరారు. అందుకు పీవో సానుకూలంగా స్పందించినప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు. ఇదిలా ఉండగా పీహెచ్‌సీ పక్కనే ఉన్న మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో వేరొక చోట మండల పరిషత్ కార్యాలయానికి భవనాలు నిర్మించారు. అయితే శిథిలమైన మండ పరిషత్ కార్యాలయాన్ని కూల్చి సీహెచ్‌సీకి భవనాలు నిర్మిస్తే అనుకూలంగా ఉంటుందనే అందరూ భావిస్తున్నారు. స్థానికంగా సీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే గైనకాలజీ, ఎముకల వైద్యులు, ఎండీ జనరల్ మెడిసిన్ వంటి స్పెషాలిటీ వైద్య సేవలు అందే అవకాశం ఉంది. దీంతో మెరుగైన సేవల కోసం రోగులు ఎదురుచూస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

కొన్నేళ్లుగా ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంగా మార్చాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. ఇక్కడ పీహెచ్‌సీ.. సీహెచ్‌సీగా స్థాయి పెరిగితే మెరుగైన సేవలు అందే అవకాశం ఉంది.

-డాక్టర్ ప్రదీప్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి

అన్నప్రసాద వితరణలో మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచముఖేశ్వరాలయంలో మంగళవారం కార్తీక మాసం సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. స్వామివారికి పూజలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాద వితరణలో ఆమె పాల్గొన్నారు. ఆమెతో పాటు పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావుతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

12 మందిపై బైండోవర్ కేసులు

సీతానగరం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన 12 మందిపై మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కె.పవన్ కుమార్ బైండోవర్ కేసులు నమోదు చేశారని సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బైండోవర్ కేసుల్లో ఉన్నవారు ఏడాది కాలంలో మరలా మద్యం కేసుల్లో పట్టుబడితే రూ.లక్ష జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించనున్నట్టు తెలిపారు. మద్యం దుకాణాల యజమానులు నిబంధనలు పాటించాలన్నారు. మద్యాన్ని ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. ఇతర రాష్ట్రానికి చెందిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కరు, సారా విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే టోల్ ఫ్రీ నెంబరు 14405కు గానీ 9440902373 నెంబరుకు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యార్థిని తలకు గాయం

సీతంపేట రూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏపీఆర్ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని సవర జయసుధ తలకు గాయమైంది. గడచిన రెండు రోజుల క్రితం పాఠశాల ఆవరణలో తోటి విద్యార్థినిలతో కలిసి వాలీబాల్ ఆడుతున్న సమయంలో కిందపడటంతో తలకి గాయమైనట్టు తెలుసింది. పాఠశాల సిబ్బంది గమనించకపోవడంతో విద్యార్థినికి జ్వరం, వాంతులు వంటి అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడింది. ఇది గమనించిన పాఠశాల సిబ్బంది జయసుధను మంగళవారం సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ విద్యార్థినిని పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై జజ్జువ గ్రామంలో ఉన్న తన తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. దీనిపై ఏపీఆర్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణజ్యోతితో మాట్లాడుతూ వాలీబాల్ ఆడుతున్న సమయంలో విద్యార్థిని జయసుధకు వాలీబాల్ తగిలిందని, ముందస్తుగా మెరుగైన వైద్య పరీక్షల కోసం శ్రీకాకుళం తీసుకువెళ్లామన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

పాలకొండ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): సింగన్నవలస కూడలిలో 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ మొబైల్ టీం సీఐ వెంకటపతిరాజు తెలిపారు. మంగళవారం ఉదయం సారాను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ మొబైల్ టీం సభ్యులు పాల్గొన్నారన్నారు..

పంట మార్పిడిపై దృష్టి సారించండి



అవగాహన కల్పిస్తున్న జిల్లా పీడీ

గరుగుబిల్లి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పంట మార్పిడిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు సూచించారు. మంగళవారం గిజబలో పంట మార్పిడి విధానంపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో రైతులు విధిగా మినుము, పెసరతో పాటు పలు రకాల పంటలు సాగు చేసుకోవాలన్నారు. ప్రకృతి విధానంలో సాగు చేస్తే పెట్టుబడులు తగ్గుతాయన్నారు. సహజ ఎరువులకు రైతుల ప్రాధాన్యమివ్వాలన్నారు. అరటి పంటలో అంతర్ పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. వరి పంట కోతకు వారం రోజులు ముందుగా అపరాలు వేసుకోవాలన్నారు. ప్రధాన పంటలతో పాటు అపరాల సాగుతో అధిక ఆదాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఏలు జి.అన్నపూర్ణ, శారద, యూనిట్ ఇన్‌చార్జి ప్రసాద్, వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వంటశాలలు దగ్ధం

సీతంపేట రూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): దిబ్బగూడ గ్రామంలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో నలుగురు గిరిజనులకు చెందిన వంటశాలలు దగ్ధమయ్యాయి. గ్రామంలో మధ్యాహ్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎన్.సత్యం, జె.చిన్నమ్మి, ఎస్.బుడ్డు, ఎన్.పార్వతీలకు చెందిన వంటశాలలు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. వంటశాలల్లోని ఫ్రిజ్, బియ్యం, వంట సామగ్రి కాలిపోయాయి. ఆర్ఐ విజయగణేష్ దిబ్బగూడకు చేరుకుని నష్టం అంచనా వేశారు.

ఫుడ్‌స్టాల్స్, ఆటో నిర్వాహకులతో సమావేశం నేడు

సీతంపేట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అడ్వంచర్‌పార్క్‌లో అద్దె ప్రాతిపదికన ఫుడ్ స్టాల్స్, ఆటో నిర్వహణకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు అడ్వంచర్ పార్క్‌కు హాజరుకావాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యాటకులను ఆటోలో తిప్పేందుకు ఆసక్తి కలిగిన వారు మాత్రమే హాజరు కావాలని సూచించారు.

పది ఫలితాల్లో మొదటి వరుసలో ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

● ప్రైవేటు పాఠశాలల కంటే మంచి ర్యాంకులు రావాలి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా మొదటి వరుసలో నిలవాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యాశాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను కొలిచే మొదటి ప్రమాణం వారి ర్యాంకేనని అన్నారు.జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు మించి ప్రభుత్వ పాఠశాలలు ర్యాంకులు సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

నాణ్యతపై దృష్టి పెట్టండి..

మధ్యాహ్న భోజన పథకం నాణ్యతపై దృష్టి పెట్టాలని విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. మెనూ కచ్చితంగా పాటించాలని చెప్పారు. డీఈవో మాణిక్యం నాయుడు మాట్లాడుతూ గత సంవత్సరం 87 శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలో మన జిల్లా 7వ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈసారి మరింత మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డిసెంబరు 5వ తేదీలోగా సిలబస్ పూర్తి చేసి... 100 రోజుల కార్యాచరణ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. అనంతరం ఉత్తమ సేవలందించిన స్కౌట్ మాస్టర్లను కలెక్టర్ సత్కరించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్యాలను సకాలంలో సాధించాలి

ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలను సకాలంలోని సాధించాలని కలెక్టరు రామసుందర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం రాత్రి తన చాంబర్‌లో జిల్లాలోని పలు ప్రాజెక్టులను సంబంధించి భూసేకరణ, ఎంఎస్ఎంఈ పార్కుల, పరిశ్రమల అభివృద్ధిపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎన్‌హెచ్-130 సిడి రోడ్డు ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువు లోగా జరగాలన్నారు. జాప్యాన్నికి గల కారణాలు గుర్తించి పరిష్క రించాలన్నారు. రైల్వే మూడు,నాలుగో లైనుల్లో భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, ఆర్‌డీవోలు కీర్తి, రామ్మోహన్, ప్రమీలగాంధీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

● ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో విషాదం


వెంకటనాయుడు (ఫైల్)

బెలగాం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణను ఈనెల 30నచేసి శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో గడుపుదామని మురిసిపోతున్న ఆ ఉపాధ్యాయుడిని మృత్యువు కబళించింది. మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఆయన మృతిచెందారు. దీంతో ఆయన కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసుల కథనంమేరకు.. పార్వతీపురం పట్టణంలోని బైపాస్ కాలనీలో నివాసముంటున్న మరిశర్ల వెంకటనాయుడు (62) పార్వతీపురం మండలం నర్సిపురం పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయు డిగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా నర్సిపురం విజయబ్యాంక్ దగ్గరలో గుర్తు తెలియని వాహనం ఆయన్ని ఢీకొట్టింది. దాంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సహచర ఉపాధ్యాయులు ఘటనా స్థలానికి చేరుకని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు జిల్లా ఆసుపత్రిలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

రీసర్వేలో సమస్యల పరిష్కారానికి కృషి: ఆర్డీవో

లక్కవరపుకోట, నవంబరు 18(ఆంధ్ర జ్యోతి): రీసర్వేలో సాంకేతిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆర్డీవో కీర్తి తెలిపారు. మంగళవారం సోంపురం జంక్షన్‌ను ఆనుకొని ఉన్న పెట్రోల్‌బంకు ఏర్పాటుపై తహసీల్దార్ కోరాడ శ్రీనివాస రావుతో కలిసి స్థల పరిశీలించారు.

చట్ట ప్రకారం దత్తత తీసుకోవాలి

గంట్యాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) చట్ట ప్రకారం పిల్లలను దత్తత తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో ఉమాభారతి సూచించారు. గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టులో మంగళవారం నవంబరు నెల దత్తత అవగాహన మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తత తీసుకునే విధానంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బీపీఎస్‌ను వినియోగించుకోండి

రాజాం రూరల్, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): అక్రమకట్టడాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన బీపీఎస్ పథకాన్ని వినియోగించుకోవాలని మునిసిపల్ కమిషనర్ రామచంద్రరావు ఒక ప్రకటనలో కోరారు. 1985 నుంచి ఈఏడాది ఆగస్టు 31వరకూ చేపట్టిన భవన నిర్మాణాలకు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు.ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకున్న భవనాలకు చట్టబద్ధత వస్తుందని పేర్కొన్నారు. ఇంటిపన్నుపై దీర్ఘకాలిక అనధికార అపరాధరుసుము నుంచి విముక్తి లభిస్తుందని తెలిపారు.

రోజుకి రూ.307 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలి

భోగాపురం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా పనిచేసేవారికి రోజుకి కనీసం రూ.307 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ శారదా దేవి కోరారు. మంగళవారం మండలంలోని ముంజేరులో ఉపాధిహామీ పథకం పనులు పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ముందస్తుగా కొలతలు ఇచ్చి ఆ ప్రకారం పని పూర్తి చేసేలా చూడాలని, తద్వారా అనుకున్న వేతనం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో భాగ్యలక్ష్మి, క్షేత్ర సహాయకులు అచ్చుతరావు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గజపతినగరం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి):లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారి ఎ.విజయ్ రాజ్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేనెల 13న నిర్వ హించే జాతీయ మెగాలోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవా లని సూచించారు.కార్యక్రమంలో సీఐ రమణ, ఎక్సైజ్‌శాఖ సీఐ జనార్దన్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన వెటర్నరీ కళాశాల విద్యార్థులు

గరివిడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గరివిడిలోని వెటర్నరీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభచూపి తృతీయ బహుమతి సాధించారు. ఇటీవల మహారాష్ట్ర యానిమల్ అండ్‌ఫిషరీ సైన్సెస్ కాలేజీ ఆతిథ్యంలో భారత వైద్య పరిశోధన మండలి, వీసీఐ సహకారంతో వన్‌హెల్త్ యూత్ కాంక్లేవ్ -2025 అనే సాంస్కృతిక పోటీలు జరిగాయి. ఇందులో గరివిడి కళాశాల విద్యార్థులు శ్రీవేంకటే శ్వరవెటర్నరీ యూనివర్సిటీ తరఫున పాల్గొని వన్‌హెల్త్ అంటే ఏమిటి అన్న అంశంపై షార్ట్‌వీడియోగ్రఫీ చేసి పోటీల్లో ప్రదర్శించారు. దీనికిగాను జాతీయ స్థాయిలో మూడో స్థానం లభించింది. ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, ప్రొఫెసర్లు ఆనీ సుప్రియా, బీఆర్ అంబేడ్కర్ అభినందించారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో ధరల పట్టికలు పెట్టాలి

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలు, క్లీనిక్స్, ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్లలో తప్పనిసరిగా ధరల పట్టికలను పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు జీవనరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరల పట్టిక వివరాలను పూర్తిగా అందరికీ కనబడే విధంగా తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లింగనిర్ధారణ చట్ట రీత్యానేరంఅన్న బోర్డులను తెలుగు,ఇంగ్లీషు భాషల్లో ప్రచురించాలని తెలిపారు. ప్రతి ఆసుపత్రికి ఫైర్‌అనుమతులు ఉండాలని , సంతాన సాఫల్యకేంద్రాలు నడిపితే ఏఆర్‌టీ, సరోగసీ చట్టం అనుసరించి జాతీయ పోర్టల్ రిజిస్టర్ తప్పనిసరి అని తెలిపారు.

కాలువ నిర్మాణానికి ఒప్పుకోం

● సిద్ధార్థ కాలనీవాసుల ఆందోళన ● పనులకు ముంజేరు గ్రామస్థుల సన్నాహాలు ● వాదోపవాదాలతో ఉద్రిక్తత

భోగాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముంజేరు పంచాయతీలోని సిద్ధార్థ కాలనీలో మురుగు కాలువ నిర్మాణ పనుల విషయంలో మంగళవారం ఉద్రిక్తత తలెత్తింది. వివరాల్లోకి వెళితే.. సిద్ధార్థ కాలనీ మీదుగా మురుగు కాలువ నిర్మాణం విషయమై స్థానికులు, ముంజేరు వాసుల మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ముంజేరు ఆర్ అండ్‌బీ రహదారి నుంచి సిద్ధార్థ కాలనీ మీదుగా మురుగు కాలువ నిర్మాణానికి కొన్నేళ్ల కిందట అధికారులు ప్రయత్నించారు. దీనిని సిద్ధార్థ కాలనీ వాసులు అడ్డుకున్నారు. గతంలో కలెక్టర్, ఆర్డీవో, ఎస్సీ కమిషన్ ఛైర్మన్, పోలీసు అధికారులు వచ్చి.. ప్రయత్నించినా పరిష్కారం కాలేదు. దీంతో కాలువ సమస్య అలాగే ఉండిపోయింది. ఇటీవల మరోసారి కాలువ నిర్మాణానికి పంచాయతీలో తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలో ముంజేరు గ్రామస్థులు, కాంట్రాక్టర్ (డ్వాక్రా మహిళ) కలసి మంగళవారం కాలువ నిర్మాణ పనుల కోసం జేసీబీతో సిద్ధార్థ కాలనీ సమీపంలో పూడిక తొలగించేందుకు యత్నించారు. దీనిని సిద్ధార్థ కాలనీకి చెందిన మహిళలు అడ్డుకున్నారు. కాలువ నిర్మాణం చేపట్టడానికి అంగీకరించబోమని పట్టుబట్టారు. అక్కడి గృహాలను తొలగించి...మరోచోట మంజూరు చేయించి... అప్పుడు కాలువ నిర్మించుకోవాలని అన్నారు. లేదంటే తమ ప్రాణాలు పోయినా మురుగు కాలువ నిర్మాణానికి అంగీకరించబోమని తేల్చిచెప్పారు. దీంతో ముంజేరు గ్రామస్థులు, సిద్ధార్థ కాలనీవాసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇది తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ పాపారావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. మరోవైపు ఈవోపీఆర్‌డీ గాయత్రి, కార్యదర్శి రమణమ్మ అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, అధికారులు స్థానికులతో కొంతసేపు మాట్లాడి అక్కడి నుంచి వెనుదిరిగారు. మధ్యాహ్నం తరువాత ముంజేరుగ్రామస్థులు మరోసారిపనులు చేపట్టగా..సిద్ధార్థ కాలనీ వాసులు అడ్డుకున్నారు. కాలువ నిర్మాణ ప్రాంతంలో బైఠాయించారు. దీంతో అక్కడ పనులను ఆపేశారు. ఈ విషయమై వివరణ అడిగేందుకు ప్రయత్నించగా అధికారులు మాట్లాడేందుకు విముఖత చూపారు.

గుర్లలో స్టీల్‌ప్లాంట్: కిమిడి


కొత్తఅగ్రహారం వాసులతో మాట్లాడుతున్న కళావెంకటరావు

చీపురుపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుర్ల వద్ద ఐదు వేల కోట్లతో స్టీల్‌ప్లాంట్ రానుండడంతో నియోజకవర్గానికి పూర్వ వైభవం వస్తుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. మంగళవారం చీపురుపల్లి టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆటంకాలు కల్పించవద్దని రైతులను కోరారు. మద్దువలస, తోటపల్లి, కొవ్వాడ భూసేకరణలో అనుసరించిన కన్సెంట్ అవార్డు విధానం ద్వారా రైతులకు తక్షణ పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్టు వల్ల ఈ ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, ఏఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు రేగాన రామారావు, వలిరెడ్డి శ్రీరాములునాయుడు పాల్గొన్నారు. కాగా ఆర్వోబీ వల్ల తమ కాలనీకి వెళ్లే రోడ్డు మూసుకుపోతుందని, 20 అడుగుల రహదారి సౌకర్యం తమకు కల్పించాలని రిక్షాకాలనీ, కొత్తగ్రహారం వాసులు కోరారు. కళా వెంకటరావును వారంతా పార్టీ కార్యాలయంలో కలిశారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: అదితి


టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న అదితిగజపతిరాజు

విజయనగరం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం నియోజకవర్గం పరిధిలోని ఆరో డివిజన్ జమ్ములో వైసీపీకి చెందిన మాజీ ఉపసర్పంచ్ బార్నాల శ్రీను, బార్నాల శేఖర్, బార్నాల సంజీవరావు, కోట్ల వెంకటరావులు అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ పార్టీ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు గంటా రవి, పీతల కోదండరామ్ పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించాలి

గజపతినగరం,నవంబరు18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీ సీఈవో సత్యనారాయణ కోరారు. మంగళవారం మండలంలోని గుడివాడ, మరుపల్లి గ్రామాల్లో గల చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. గుడివాడలో పారిశుధ్య పనులపై చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వే కాల్స్‌పై గ్రామస్థులను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కళ్యాణి,డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్, రమణ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే నగరాభివృద్ధి

విజయనగరం టౌన్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టికృషితోనే నగరాభివృద్ధి సాధ్యమని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ మావేశమందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 అంశాలను పొందుపరచగా సభ్యులు ఆమోదించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను పూర్తిచేయాలని కోరారు. ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేశ్వరరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులు నిజాయితీగా విధులు నిర్వహిస్తున్నారని, అయితే కొంతమంది మాత్రం వీరిని టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. కార్పొరేషన్ సిబ్బందికి స్టాండింగ్ కమిటీ పూర్తిస్థాయి మద్దతును ఇస్తుందని చెప్పారు. ప్రతి 15 రోజులకు ఒకసారి స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటుచేసుకోవాలని కోరారు. సమావేశంలో కమిషనర్ నల్లనయ్య, సహాయకమిషనర్ కె.అప్పలరాజు, కమిటీ సభ్యులు అల్లు చాణక్య, జీవీ రంగారావు, సుంకర నారాయణస్వామి, రేగాన రూపాదేవి పాల్గొన్నారు.

విధులకు సకాలంలో హాజరుకావాలి

రాజాం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని కోరారు. ఫీల్డ్‌కు వెళ్లిన సిబ్బంది సైతం ఆ వివరాలను కార్యాలయంలో పొందుపరచాలని సూచించారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు.

వ్యాపారులకు అండగా ఉంటాం

రాజాం రైతుబజార్‌లో అద్దెలు చెల్లిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి అండగా ఉంటామని మునిసిపల్ కమిషనర్ రామచంద్రరావు స్పష్టం చేశారు. పాతబస్టాండ్ ఆవరణలోని రైతుబజార్ వెలుపల పదుల సంఖ్యలో కూరగాయల వ్యాపారం చేస్తుండడంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, కనీసస్థాయిలో అమ్మకాలు కూడా జరగడం లేదని ఈనెల 17న పలువురు వ్యాపారులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈనేపథ్యంలో రైతుబజార్ లోపల, వెలుపల కమిషనర్ మంగళవారం పరిశీలించారు. 41 షాపులు ఖాళీగా ఉండడాన్ని కమిషనర్ గుర్తించారు. మార్కెటింగ్ శాఖ అధికారులతో మాట్లాడి వెలుపల వ్యాపారాలు చేసుకుంటున్న వారికి లోపల షాపులు ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు.

ఎస్.కోట పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి

శృంగవరపుకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల క్రీడామైదానం అభివృద్ధికి యువత నడుంబిగించింది. మన ఊరు-మనగ్రౌండ్ పేరుతో వాట్సాస్ గ్రూపు క్రియేట్‌చేసి మైదానాన్ని అభివృద్ధికోసం సందేశాలను పంపారు.వీరంతా ఇటీవల పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. ప్రజాప్రతినిధులతోపాటు దాతలసాయం అర్థిస్తున్నారు. ఈనేపథ్యంలో టీడీపీ నాయకులుకాపుగం టి.వాసు, వాకాడ బాలుమైదానాన్ని చదును చేసేందుకు ముందుకొచ్చారు. రూ.50వేలు వెచ్చించి తుప్పలు, డొంకలను తొలగించారు. ఘన కీర్తికలిగిన ఈమైదానం దశాబ్దకాలంగా నిరాదరణకు గురవుతోంది. చూట్టు ఆక్రమణలకు గురికావడంతోపాటు ప్రహరీ కూడాలేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మైదానం చెరువును తలపిస్తోంది. ఈ నేపథ్యంలో యువకులు చూట్టు ప్రహరీ గోడ, దీనికి ఆనుకొని వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్లు, సేద దీరేందుకు బెంచీలు, వాటి వద్ద నీడను ఇచ్చే మెక్కలను పెంచడం, మధ్యలో విద్యార్థులు ఆడుకో నేందుకు వివిధ రకాల కోర్టులను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు తయారు చేసారు.


మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

అర్ధరాత్రి కె.కావేరి బస్సు బీభత్సం

● ముందు వాహనాలను ఓవర్ టేక్ చేయబోయి ప్రమాదం

● ఎన్టీఆర్ జిల్లాలో ఘటన ● 8 మందికి గాయాలు ● క్షతగాత్రుల్లో జిల్లా వాసి


నుజ్జునుజ్జైన బస్సు ముందుభాగం

నందిగామ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కె.కావేరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ కోచ్ బస్సు అతి వేగంతో ఓవర్ టేక్ చేస్తూ ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. సోమవారం అర్ధరాత్రి నందిగామ వద్ద బైపాస్ రోడ్డుపై ఈ ఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ప్రాణహాని జరగలేదు. కావేరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ కోచ్ బస్సు అతి వేగంతో ఓవర్ టేక్ చేస్తూ ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 23 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదంలో బస్సు భాగాలు లారీలో ఇరుక్కుపోయాయి. ఈ ఘటనలో 9 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఆరుగురికి స్వల్ప గాయాలు కాగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వరుస బస్సు ప్రమాదాల నేపథ్యంలో చోటు చేసుకున్న ఈ ఘటన ఉలికిపాటుకు గురి చేసింది. క్షతగాత్రులలో ఆరుగురికి స్వల్ప గాయాలు మాత్రమే కావడంతో ప్రథమ చికిత్స అనంతరం వారు వెళ్లిపోగా మిగిలిన ముగ్గురినీ విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుల్లో విజయనగరం జిల్లా డెంకాడకు చెందిన బెవర సతీష్‌కుమార్ ఎడమ మోకాలికి గాయమైంది.

మరింత మెరుగ్గా పోస్టల్ సేవలు

భోగాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని విజయనగరం తూర్పు సబ్‌డివిజన్ పోస్టల్ శాఖ ఏఎస్పీ సుందరనాయుడు తెలిపారు. భోగాపురం సబ్ పోస్టాఫీసులో మంగళవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ ద్వారా గతం కంటే మెరుగైన సేవలందుతున్నాయని తెలిపారు. రిజిస్టర్ పోస్టుకు బదులుగా ప్రస్తుత కాలానికి అనుగుణంగా స్పీడ్ పోస్టు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సబ్‌పోస్టుమాస్టర్ రవి పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

● మార్క్‌ఫెడ్ మేనేజర్ వెంకటేశ్వరరావు

భోగాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటను విక్రయించే విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు రాత్రింబవళ్లు కష్టపడి పండించుకొనే పంటను అమ్ముకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను ఆశ్రయించకూడదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణమ్మ, ఎంపీడీవో స్వరూపారాణి పాల్గొన్నారు.

శివలింగానికి కిరణ స్పర్శ


శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

రాజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంతమార్కెట్‌లో వెలసిన మల్లికార్జున స్వామి వారి ఆలయంలో మంగళవారం ఉదయం శివలింగాన్ని సూర్యకిరణాలు తాకాయి. ఈ దృశ్యాన్ని చూడటానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చా రు. అనంతరంస్వామి వారికి అర్చకులు యశ్వం త్ ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం ప్రారంభానికి ముందు గతనెలలో శివలింగానికి సూర్యకిరణాలు తాకాయని.. నెల రోజుల వ్యవధిలో రెండోసారి ఇలా స్పృశించాయని యశ్వంత్ తెలిపారు.

గౌరీ పరమేశ్వరులకు పూజలు

శృంగవరపుకోట, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): ఎస్.కోట వన్‌వే ట్రాఫిక్ సమీపంలో ఆలయంలోగల శ్రీగౌరి పరమేశ్వరులకు గౌరి సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రత్యేక పూజలుచేశారు.

అయ్యప్పస్వాముల నగర సంకీర్తన

రాజాం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజాంలో సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాలను పురస్కరించుకుని మంగళవారం వేకువజామున రెండుగంటల పాటు వందలాది మంది అయ్యప్ప దీక్షాధరులు పురవీధుల్లో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆరు మద్యం సీసాల స్వాధీనం

బొండపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):గొట్లాంలో ఆరు మద్యం సీసాలు ఓ మ హిళ నుంచి స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్ఐలు పి.శాంతిలక్ష్మి, పి.నరేంద్రకుమార్, కానిస్టేబుళ్లు వి.అప్పారావు, అప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్ కండక్టర్ వైర్ చోరీ

భోగాపురం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కివరం జంక్షన్ సమీపంలో విద్యుత్ కండక్టర్ వైర్ చోరీపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.దుర్గాప్రసాదురావు మంగళవారం తెలిపారు. సర్వే నెంబరు 436, 437లో ఈనెల నాలుగో తేదీన నాలుగు కిలో మీటర్ల పరిధిలో కండక్టర్ వైర్ చోరీ జరిగినట్లు పేర్కొన్నారు.విశాఖ జిల్లా పెదవాల్తేరుకు చెందిన పి.నీలాద్రిరాజు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దగ్ధమైన కారు నెల్లూరు వాసిదిగా గుర్తింపు

ఎస్.కోట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బొడ్డవర హైవే వద్ద ఇటీవల దగ్ధమైన కారు వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈమేరకు కారు పూర్తిగా దగ్ధమయ్యిందని, దీని సాసి, ఇంజన్ నెంబర్లను సేకరించామని సీఐ నారాయణమూర్తి తెలిపారు.ఈ మేరకు కారు అడ్రస్ లభించిందని, నెల్లూరుకు చెందిన వ్యక్తిదిగా గుర్తించి, ఆయనకు ఫోన్‌చేసినట్లు చెప్పారు. కొద్దిరోజుల కిందట ఓ వ్యక్తి తన కారు తీసుకొని వెళ్లాడని, తర్వాత ఆయన ఫోన్‌స్విచాఫ్ చేశాడని నెల్లూరువాసి తెలియజేశాడని సీఐ పేర్కొన్నారు. ఈ విషయంపై మరింత దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం: సీఐ

విజయనగరం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సోషల్ మీడియాకుదూరంగా ఉండాలని మహిళా పోలీసుస్టేషన్ సీఐ ఈ నర్సింహమూర్తి తెలిపారు. మంగళవారం విజయనగరంలోని పలు జూనియర్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ శిరీష, శక్తి బృందం కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను విడిచిపెడితే చర్యలు

విజయనగరం క్రైం,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ప్రధానరహదారులపై పశువులను విడిచిపెడితే యాజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. రహదారులపై పశువులు సంచరించడంతో ప్రమాదాలు పెరగడంవల్ల ప్రజలు, వాహనదారుల భద్రతదృష్ట్యా పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు.

లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలి: ఏఎల్‌డీఎం

బొండపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల నుంచి వివిధ పథకాల ద్వారా రుణాలు తీసుకొని వ్యాపారాలు, ఇతర వ్యవహారాలు నిర్వహిస్తున్న లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలని నాబార్డు ఏఎల్‌డీఎం వైడీ ప్రత్యూష సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గస్థాయిలోని వివిధ బ్యాంకులు, వెలుగు, ఉపాధి, పశుసంవర్ధకశాఖ, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం టి.నాగార్జున, స్త్రీనిధి బ్యాంకు లింకేజీ డీపీఎం జె.లక్ష్మంనాయుడు పాల్గొన్నారు.

కొత్తవలస తహసీల్దార్‌పై విచారణ

కొత్తవలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస తహసీల్దార్ పి.అప్పలరాజుపై విజయనగరంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుమేరకు మంగళవారం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మురళీ కృష్ణ విచారణ నిర్వహించారు.మండలంలోని చీపురువలసకు చెందిన సర్వే నెంబరు 162-2లోని మూడెకరాల 95 సెంట్లకు సంబంధించి ఎంపీటీసీ మాజీ సభ్యుడు యల్లపు సూరిబాబు తనను తహసీల్దార్ లంచం అడిగారని ఫిర్యాదుచేశారు. ఈ మేరకు విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ మంగళవారం తహసీల్దార్ కార్యాలయలో విచారణ జరిపారు. మళ్లీ విచారణను బుధవారానికి వాయిదా వేశారు. తనపై నిరాధారమైనా ఆరోపణలు చేశారని తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు

నెల్లిమర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తారకరామా తీర్థసాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా సరిపల్లి గ్రామానికి చెందిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు కోరారు. ఈ మేరకు కలెక్టర్ రామసుందర్‌రెడ్డిని నిర్వాసిత రైతులు, టీడీపీనాయకుడు గేదెల రాజారావు,బోనుమహంతి ఆదినారాయణ, బాబూరావు, సారిపల్లి గోపాలమూర్తి, ఆల్తి ప్రకాషరావుతో కలిసి ఆయన మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

క్రీడాకారులు ఆరోగ్యాన్ని కాపాడుకోండి

విజయనగరం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలని ఎస్పీ దామోదర్ సూచించారు. ఇటీవల కాకినాడలో జరిగిన 14వ రాష్ట్ర తైక్వాండో పుమ్సే 2025 పోటీల్లో ట్రాఫిక్ కానిస్టేబుల్ బీఎస్ఎన్ మూర్తి మూర్తి బంగారు పతకం సాధించడంతో పాటు త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనేపథ్యంలో కానిస్టేబుల్‌ను ఎస్పీ దామోదర్ మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు.కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్‌బీ సీఐ లీలారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు

భోగాపురం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం భోగాపురం మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మళ్లీ పల్లెపండుగ

రాజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మళ్లీ పల్లెపండుగ కార్యక్రమం చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఆ నిధులతో మిగిన సిమ్మెంట్ రోడ్లు నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో జె.ఆనందరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, జడ్పీటీసీ నర్సింహులు, రాజగోపాలనాయుడు పాల్గొన్నారు.